ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రెండు మొబైల్ బృందాల ఏర్పాటు
- మా వెబ్‌సైట్ ఓపెన్ అవుతున్నది
- 32 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నది

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఏపీ నుంచి వచ్చే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రెండు మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్టు ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎండీసీ) తెలిపింది. ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చెక్ పోస్టులు కూడా ఇప్పటికే ఏర్పాటు చేశామని, వీటిద్వారా నిఘా పెడుతున్నట్టు వివరించింది. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం వచ్చిన 'ఇసుక ధర డబుల్' వార్తపై టీఎస్‌ఎండీసీ జనరల్ మేనేజర్ స్పందించారు. తమ వెబ్‌సైట్ ఓపెన్ అవుతున్నదని, వినియోగదారులకు కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉన్నదని స్పష్టం చేశారు. ఇసుక ధరలు పెరిగాయా? లేదా? అన్న విషయంపై మాత్రం మాట్లాడలేదు. తమ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదన్న ఫిర్యాదులేమీ రాలేదని తెలిపారు. జనవరిలో 31.75 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నదని, దాంతో కేవలం 14.79 లక్షల టన్నుల ఇసుకకు మాత్రమే బుకింగ్‌లు వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 32 లక్షల టన్నుల ఇసుక డిపోల్లో అందుబాటులో ఉన్నదని తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే ఇసుకపై మాత్రమే రెగ్యులేటింగ్ చార్జీలు వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ఇసుక సరఫరా విషయంలో ఏవైనా ఫిర్యాదు లుంటే తమ టోల్ ఫ్రీ నంబర్ 040-155242ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థినుల ఆత్మహత్యపై దర్యాప్తు ముమ్మరం

పోలీసుల అదుపులో అనుమానితులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన భువనగిరి ఎస్సీ హాస్టల్ పదో తరగతి విద్యార్థినుల ఆత్మహత్యపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. భువనగిరి పట్టణ సీఐ సురేశ్‌కుమార్ నేతృత్వంలో ఘటనపై సమగ్రంగా నివేదికను రూపొందిస్తున్నారు. పదో తరగతి విద్యార్థినులు వైష్ణవి, భవ్య హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోగా.. ఘటనా స్థలంలో ఆత్మహత్యకు వినియోగించిన చున్నీ, సూసైడ్ నోట్, డోర్ బోల్టులను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని పోలీసులు చెప్పారు. హాస్టల్ వార్డెన్ శైలజ, ఆటో డ్రైవర్ ఆంజనేయులు, ముగ్గురు వంట మాస్టర్లు, ట్యూషన్ టీచర్లు సుజాత, సులోచన, ప్రతిభ, భువనేశ్వరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

దేశానికి చంద్రయాన్ సైన్స్ కంటే.. చంద్రశేఖర్‌రావు విజన్ అవసరం

- పలు రాష్ట్రాల్లో కరువు ఉన్నా.. తెలంగాణలో దరిదాపుల్లోకి రాలేదు
- అదంతా కేసీఆర్ సొంత ఫార్ములాతోనే సాధ్యమైంది
- రైతు సమస్యల పరిష్కారానికి ఉప ప్రధాని పదవి ఏర్పాటు చేయాలి
- వ్యవసాయ సంబంధ శాఖలన్నీ ఆయనకు అనుసంధానించాలి
- జిల్లా స్థాయిలో ప్రణాళిక సంఘాలను ఏర్పాటు చేయాలి
- అప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది
- హైదరాబాద్‌లో సుప్రీం బెంచ్‌ను ఏర్పాటు చేయాలి
- రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): దేశానికి 'చంద్రయాన్' సైన్స్ కంటే తెలంగాణ ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు లాంటి నాయకుల విజన్ (దార్శనికత) ఎంతో అవసరమని బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 2020లో ఒడిశా, రాజస్థాన్ లాంటి పలు రాష్ట్రాలతోపాటు బుందేల్‌ఖండ్, రాయలసీమ ప్రాంతాలు కరువుతో అల్లాడినప్పటికీ తెలంగాణలో కరువు ఛాయలే లేవని గుర్తుచేశారు. ఆ ఏడాది తెలంగాణ అధిక పంటలను ఉత్పత్తి చేసి తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని తెలిపారు. ఇది చంద్రయాన్ సైన్స్‌తో సాధ్యం కాలేదని, బీఆర్‌ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు ఫార్ములాతోనే సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గానూ ప్రత్యేకంగా ఉప ప్రధాని పదవిని ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సంబంధిత శాఖలను ఉప ప్రధానికి అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. వ్యవసాయం, అన్నదాతల అంశానికి సంబంధించిన ఏ ఫైలైనా ప్రస్తుతం ఐదు శాఖల వద్దకు వెళ్లాల్సి వస్తున్నదని, ఆ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా డిప్యూటీ ప్రధాన మంత్రి పదవిని సృష్టించాలని, తద్వారా రైతులకు సంబంధించిన ఏ సమస్య అయినా రెండు నిమిషాల్లో పరిష్కారం అవుతుందన్న నమ్మకం కల్పించాలని కోరారు. రబీలో వరి సాగు చేయవద్దని, ఖరీఫ్ రాగానే వరి సాగు చేయాలని చెప్పడం దారుణమని పేర్కొంటూ.. వ్యవసాయ మేమి స్విగ్గీ సర్వీసు కాదని ఎద్దేవా చేశారు.

నీతి ఆయోగ్‌ను బలోపేతం చేయాలి..

దేశ అభివృద్ధి కోసం నీతి ఆయోగ్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని ఎంపీ సురేశ్‌రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో ఉన్న ప్రణాళికా సంఘం మాదిరిగా నీతి ఆయోగ్ పని చేయడం లేదని కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నీతి ఆయోగ్‌ను ఎవరికీ నమ్మకం లేని సంస్థగా తయారు చేసిందని విమర్శించారు. తెలంగాణలో మిషన్ భగీరథ పథకానికి రూ.5 వేల కోట్లు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ ప్రతిపాదనను కేంద్రం అమలు చేయకపోవడమే ఇందుకు ప్రబల నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్‌ను పటిష్ఠపర్చడంతోపాటు జిల్లాల స్థాయిలో ప్రణాళికా సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయి నుంచి కేంద్ర స్థాయికి ప్రణాళికా సంఘాలను అనుసంధానించడం ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

పార్లమెంట్ పనితీరు విచారకరం..

ప్రస్తుతం పార్లమెంట్ పనితీరు తీవ్ర విచారాన్ని కలిగిస్తున్నదని ఎంపీ సురేశ్‌రెడ్డి పేర్కొంటూ.. ప్రజల అవసరాలు, ఆకాంక్షల మేరకు చట్టసభలను నిర్వహించాలని కోరారు. గత ఐదేండ్లలో కేవలం 130 రోజులు మాత్రమే పార్లమెంట్ సమావేశాలు జరిగాయని, 2023 బడ్జెట్ సెషన్‌లో ఎలాంటి చర్చ లేకుండానే కేంద్రం 75% బిల్లులను ఆమోదించుకున్నదని, 2023 వర్షాకాల సమావేశాల్లో కేవలం 43%సభా సమయాన్ని మాత్రమే సద్వినియోగం చేసుకోగలిగామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రాంతీయపార్టీల ప్రాతినిధ్యం పెరుగుతున్నందున అందరికీ అవకాశమివ్వాలని సూచించారు. పార్లమెంట్ పనిదినాలను పెంచడంతోపాటు ఎజెండా రూపకల్పనలో ప్రతిపక్షాలకూ అవకాశం కల్పించాలని, అన్ని అంశాలపై సమగ్ర చర్చకు వీలు కల్పించాలని కోరారు. గతంలో సభ్యుల ప్రైవేట్ బిల్లులను పార్లమెంట్‌లో అంగీకరించేవారని, ఇకనైనా ఆ పద్ధతిని పునరుద్ధరించి ప్రైవేట్ బిల్లులపై చిత్తశుద్ధితో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. 16వ లోక్‌సభలో 25% బిల్లులు, 17వ లోక్‌సభలో 14 బిల్లులను మాత్రమే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల పరిశీలనకు పంపారని, 14, 15 లోక్‌సభలతో పోల్చితే ఇది చాలా తక్కువని తెలిపారు. వాటిలో చాలా బిల్లులు పాస్ అయినా కార్యరూపం దాల్చడంలేదని అసహనం వ్యక్తంచేశారు.

ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లును అష్యూరెన్సెస్ కమిటీకి పంపాలి

ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లును ఆమోదించి 10 ఏండ్లు గడుస్తున్నా అందులోని చాలా హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఎంపీ సురేశ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆ బిల్లులోని హామీల అమలుకు నిర్దేశించిన 10 ఏండ్ల గడువు ఈ ఏడాదితో పూర్తవుతుందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ బిల్లును అష్యూరెన్సెస్ కమిటీకి పంపించాలని కోరారు. గడువులోగా హామీలు అమలు కాకపోతే అదే బిల్లును మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే ఆ బిల్లుకు విలువ, పార్లమెంట్‌పై ప్రజలకు నమ్మకం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులను అనర్హులుగా ప్రకటించే అంశంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఫిరాయింపుదారులపై అనర్హత వేటుకు సంబంధించిన కేసులను పరిష్కరించేందుకు ప్రస్తుతం ఎలాంటి వ్యవస్థ లేదని, దీనిపై రాజ్యసభలో విస్తృత చర్చజరగాలని ఎంపీ సురేశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో సుప్రీం బెంచ్ ఏర్పాటు చేయాలి..

దక్షిణ భారతావనిలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు హైదరాబాద్‌ను పరిశీలించాలని ఎంపీ సురేశ్‌రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. హిందీ భాషను బలవంతంగా రుద్దొద్దని కోరారు. మణిపూర్ అంశంపై రాష్ట్రపతి ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రసంగిస్తే అక్కడి ప్రజలకు భరోసా లభించేదని, కానీ ఆ అవకాశాన్ని వదులుకోవడం విచారకరమని తెలిపారు. గతంలో ఏపీ అభివృద్ధిపై ఆ రాష్ట్ర అసెంబ్లీలో నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రసంగించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

లోకం పోకడ

ఎన్నికల ప్రచారానికి మీ రథం వాడుకుంటా అద్వానీజీ!

ఆన్‌లైన్‌లో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు!

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇకపై ఆన్‌లైన్‌లోనే లభించనున్నాయి. ఎంబీసీ-34 కౌంటర్ వద్ద టికెట్ల కోసం భక్తులు ఎక్కువసేపు క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తున్నందున ఆన్‌లైన్‌లోనే టికెట్లు ఇవ్వాలని టీటీడీ నిర్ణయించింది. సిఫార్సు లేఖలు అందజేసిన భక్తుల మొబైల్‌కు ఓ లింక్‌తో కూడిన మెసేజ్‌ను పంపుతున్నారు. భక్తులు ఆ లింకు క్లిక్ చేస్తే పేమెంట్ ఆప్షన్ వస్తుంది. అక్కడ ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది. రెండ్రోజుల నుంచి టీటీడీ ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలుచేస్తున్నది. భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొన్న తర్వాత పూర్తిస్థాయిలో అమలుపై టీటీడీ నిర్ణయం తీసుకోనున్నది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	15.4°c	36.4°c
రంగారెడ్డి	15.5°c	35.7°c
మెదక్	18.1°c	34.3°c
ఖమ్మం	19.0°c	35.0°c
నిజామాబాద్	21.1°c	33.9°c
మహబూబ్‌నగర్	21.2°c	34.9°c
నల్లగొండ	20.2°c	35.8°c
వరంగల్	22.0°c	32.0°c
కరీంనగర్	22.0°c	33.0°c
హైదరాబాద్	20.8°c	34.0°c

వీసీ నియామకాల ప్రక్రియ వేగవంతం

సెర్చ్ కమిటీల ఎంపికకు జోరుగా సమావేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను ఎంపిక చేసేందుకు ఉద్దేశించిన సెర్చ్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే వర్సిటీ పాలకమండలి నామినీల ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ఇందుకు కోసం యుద్ధప్రాతిపదికన వర్సిటీల పాలకమండలి సమావేశాలను నిర్వహిస్తున్నది. పాలమూరు, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాల పాలకమండలి సమావేశాలను మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్టీయూ పాలకమండలి సమావేశాలు మంగళవారం జరగనున్నాయి. వీసీల ఎంపిక కోసం దరఖాస్తుల గడువు ఈ నెల 12తో ముగుస్తుంది. వీసీల కోసం ఇప్పటి వరకు 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొందరు రెండు, మూడు వర్సిటీల వీసీ పోస్టులకు దరఖాస్తులు సమర్పించారు. దీంతో దరఖాస్తుల సంఖ్య 30 మించింది.

విద్యార్థుల సర్టిఫికెట్లలో కులమతాలు ఎందుకు?

- ఆ నిబంధనపై మీ వైఖరి ఏమిటి?
- రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం, బదిలీకి సంబంధించిన సర్టిఫికెట్లలో వారి కులాలు, మతాల ప్రస్తావన లేకుండా చూడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విద్యార్థుల అడ్మిషన్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లలో తల్లిదండ్రుల కులం, మతం వివరాలను పొందుపర్చాలన్న నిబంధనను సవాలు చేస్తూ 2017లో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై అత్యవసర విచారణ చేపట్టాలన్న మధ్యంతర పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసినట్టు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ప్రవీణ్యా కుమార్ తెలిపారు.

తెలంగాణ నుంచి పోటీ చేయండి

- సోనియాగాంధీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- ఢిల్లీలో సోనియాతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ
- రాష్ట్రంలో గ్యారెంటీల అమలుపై వివరణ
- 59 రోజుల్లో ఏడుసార్లు సీఎం హస్తిన పర్యటన
- సగటున 8 రోజులకోసారి ఢిల్లీకి టూర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీకి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నుంచి పోటీ చేయాలని ఇప్పటికే పీసీసీ తీర్మానం చేసిన విషయాన్ని సోనియాగాంధీ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీంతో సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని సోనియాగాంధీ అన్నట్టు సీఎం తెలిపారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి రాంచీ (జార్ఖండ్) వెళ్లిన రేవంత్.. అక్కడ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొన్నారు. అటునుంచి సాయంత్రం ఢిల్లీకి చేరుకొని సోనియాగాంధీతో భేటీ అయ్యారు. ఈ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలను సోనియాగాంధీకి సీఎం వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడాన్ని అమలుచేశామని వివరించారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అమలుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బీసీ కుల గణన చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువ సీట్లు సాధించాలని ప్రయత్నిస్తున్నామని, సీట్ల ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, కసరత్తు చేసి బలమైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు వివరించారు.

ఎంపీ సీట్లపై కసరత్తు

ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి సోనియాగాంధీని పోటీలో దింపాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. అందుకే సీఎం, డిప్యూటీ సీఎం స్వయంగా ఢిల్లీకి వెళ్లి సోనియాను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అయితే, ఖమ్మం నుంచి సోనియాగాంధీ పోటీచేయని పక్షంలో ఎంపీ టికెట్ తనకు ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భార్య నందిని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. సోనియాగాంధీ అభిప్రాయం తెలిసితన తర్వాతే తన ప్రయత్నాలను ముమ్మరం చేయాలని భట్టి భావిస్తున్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం సాయంత్రం ఎంపీ టికెట్ల ఆశావహులపై పీసీసీ ఎన్నికల కమిటీ సమావేశం కానున్న నేపథ్యంలో సోనియాగాంధీతో వీరి సమావేశం ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఎంపీ టికెట్ల ఆశావహులు, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీల ఎన్నిక, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలతోపాటు ఈ నెల 8 నుంచి ప్రారంభంకానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలు తదితర అంశాలు ఈ సందర్భంగా సోనియాగాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి వివరించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

నీతీఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ భేరితో భేటీ

కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన గ్రాంటు రూ.1,800 కోట్లు వెంటనే విడుదలయ్యేలా చూడాలని నీతీఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ భేరికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సోమవారం సుమన్‌ను కలిసి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇప్పించాలని కోరారు. ప్రపంచబ్యాంకు ఎయిడ్ విడుదలకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాగు నీటి సరఫరాకు అవసరమైన నిధులతో పాటుతమ ప్రభుత్వం వైద్య,ఆరోగ్య, విద్యా రంగాల్లో తీసుకురానున్న సంస్కరణలకు సహకరించాలని సీఎం కోరినటు సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏడోసారి హస్తినకు సీఎం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం సోమవారం నాటి పర్యటనతో ఏడోసారి. డిసెంబర్ 7న సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఇప్పటి వరకు 59 రోజుల్లో సగటున 8 రోజులకొకసారి సీఎం ఢిల్లీకి వెళ్లడం గమనార్హం.

ఢిల్లీ వెళ్లిన సీఎం, డిప్యూటీ సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ఢిల్లీకి వెళ్లారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో జరుగుతున్న భారత్ జోడో న్యాయయాత్రలో పాల్గొనేందుకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రత్యేక విమానంలో రాంచీకి వెళ్లారు. అక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై ఢిల్లీలో పార్టీ పెద్దలతో చర్చించనున్నట్టు తెలిసింది. వీరు తిరిగి మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు.

జీవో వచ్చాకే టీజీ నంబర్ ప్లేట్లు

- పాతవాటిని మార్చుకోవాల్సిన పనిలేదు
- స్పష్టంచేసిన రవాణాశాఖ అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్‌ను తెలంగాణ స్టేట్ (టీఎస్) నుంచి తెలంగాణ గవర్నమెంట్ (టీజీ)గా మార్చాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న టీఎస్ నంబర్ ప్లేట్లను మార్చుకోవాల్సిన అవసరం లేదని రవాణాశాఖ అధికారులు చెప్తున్నారు. టీఎస్‌ను టీజీగా మారుస్తున్నట్టు ప్రభుత్వం జీవో విడుదల చేసిన తర్వాతి నుంచి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాలకు అది వర్తిస్తుంది. ఈ విషయంలో ఆందోళన అవసరం లేదని, ఒకవేళ అలాంటిదేమైనా ఉంటే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటి వరకు ఎవరూ నంబర్ ప్లేట్లను తమంత తాముగా టీజీగా మార్చుకోవద్దని రవాణాశాఖ అధికారులు కోరారు.

దళితబంధుపై స్పష్టమైన ప్రకటన చేయాలి

- అన్యాయం చేస్తే అసెంబ్లీని ముట్టడిస్తాం
- ఏటూరునాగారంలో లబ్ధిదారుల నిరాహార దీక్ష

ములుగు జిల్లా ఏటూరునాగారంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న దళితబంధు లబ్ధిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 5: ఎస్సీ లబ్ధిదారులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన దళితబంధు నిధులను వెంటనే విడుదల చేసి ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ ఆ పథకం లబ్ధిదారులు ములుగు జిల్లా ఏటూరునాగారంలోని బస్టాండు సెంటర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నెల 8న నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకంపై స్పష్టమైన ప్రకటన చేయాలని లబ్ధిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద రూ.12 లక్షలను లబ్ధిదారులకు విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు దళితుల పట్ల అంకితభావంతో పని చేయాలని సూచించారు. అన్యాయం చేయాలని చూస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తమ బలం చూపిస్తామని హెచ్చరించారు. పెండింగ్ లేకుండా 30 వేల మంది లబ్ధిదారులకు నిధులు విడుదల చేసేలా నూతన ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ములుగు జిల్లాలో రెండో విడత 1,100 మంది లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే నిధులు జమచేయాలని కోరారు. నిరాహార దీక్షలో జిల్లా కార్యదర్శి మడికింద రమేశ్, గౌరవ సలహాదారుడు చిట్టిమల్ల సమ్మయ్య, గోవిందరావుపేట మండల కమిటీ అధ్యక్షుడు దర్శనాల సంజీవ, సలహాదారుడు చుక్క గట్టయ్య, జిల్లా, మండల కమిటీ నాయకులతో పాటు సుమారు 50 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గడదాసు సునీల్, నాయకులు దన్నపునేని కిరణ్, అంతటి నాగరాజు తదితరులు దీక్షకు మద్దతు ప్రకటించారు.

ఏపీ తరహాలో వేతనాలివ్వాలి

- మున్సిపల్ కార్మికుల డిమాండ్
- కరీంనగర్, రంగారెడ్డి కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా

కరీంనగర్ కలెక్టరేట్ / షాబాద్ ఫిబ్రవరి 5 : ఏపీ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం తమకు వేతనాలివ్వాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు పలు జిల్లాల్లో ధర్నా చేపట్టారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సుమారు గంటకుపైగా నిర్వహించిన మున్సిపల్ కార్మికుల ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మద్దతు పలికారు. ఏపీలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనం, హెల్త్ అలవెన్సులు కలిపి నెలకు రూ.24 వేలు, క్యాటగిరీల వారీగా పని చేస్తున్న కార్మికులకు రూ.21 వేలు చెల్లిస్తున్నారని, అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అసోద రవీందర్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు పోచయ్య, నగరపాలక సంస్థ అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, హుజురాబాద్, కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీల అధ్యక్షులు అజ్జు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద..

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు.

జీతాలు జమ కాలే.. పింఛన్లు పడలే!

- హామీ నిలబెట్టుకోలేకపోయిన సర్కారు
- ఐదో తేదీ దాటినా పడని వేతనాలు
- ఎదురుచూస్తున్న ఉద్యోగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలిస్తామని ఎన్నికల్లో హామీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దానిని నిలబెట్టుకోవడంలో విఫలమైంది. ఐదో తేదీ దాటినా చాలా సబ్ ట్రెజరీల్లో ఇప్పటి వరకు టీచర్లు, ఉద్యోగులకు వేతనాలు అందలేదు. ఒకటో తేదీన కొందరికి వేతనాలు వేసిన ప్రభుత్వం అందరికీ ఇచ్చినట్టు చెప్పుకున్నది. వాస్తవానికి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో వేతనాలు జమ కాలేదు. పింఛన్లు కూడా పడకపోవడంతో లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. వేతనాల విషయంలో ప్రభుత్వం పక్కా వ్యూహంతో వెళ్తున్నట్టు అర్థమవుతున్నది. ఒక జిల్లాలో మూడు, నాలుగు సబ్ ట్రెజరీలుంటే ఒక ట్రెజరీలో జమచేసి జిల్లా అంతా ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటూ మిగతా ట్రెజరీల్లో వేతనాలు ఆలస్యంగా జమచేస్తున్నది.

వాస్తవ పరిస్థితి ఇలా

- సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, గజ్వేల్ ఎస్టీవోలు మినహా సిద్దిపేట, తొగుట, దుబ్బాక, చేర్యాల ప్రాంత ఉద్యోగులు, టీచర్లకు ఇప్పటివరకు జీతాలు జమకాలేదు.
- జగిత్యాల జిల్లాలో మూడు ఎస్టీవోలుంటే మెట్‌పల్లి సబ్‌ట్రెజరీ పరిధిలో మాత్రమే జీతాలు జమయ్యాయి. మిగతా రెండు ట్రెజరీల్లో జీతాలు జమకాలేదు.
- ఖమ్మం జిల్లాలోని వైరా ఎస్టీవో పరిధిలోని ప్రభుత్వ లెక్చరర్లు, ఉద్యోగులకు ఇప్పటికీ వేతనాలు అందలేదు.
- కేజీబీవీల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి రెండు మాసాల వేతనాలు అందలేదు. నవంబర్ నెల వేతనాలను యూనిఫాం వస్త్ర అడ్వాన్స్‌ను ఆపి చెల్లించారు.
- సంగారెడ్డి, ఖమ్మం, రంగారెడ్డి, హనుమకొండ జిల్లాల్లో పెన్షనర్లకు ఇంత వరకు పింఛన్లు అందలేదు. ఇదే అంశంపై అధికారులను ఆరా తీస్తే సోమవారం సాయంత్రం వేస్తామని చెప్పినప్పటికీ జమ కాలేదు.

బాసర ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులకు అందని జీతాలు

బాసర, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలోని బాసర ఆర్జీయూకేటీ ఉద్యోగులకు గతంలో ఒకటో తేదీనే వేతనాలు పడేవి. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక రెండు నెలలుగా వేతనాలు ఆలస్యమవుతున్నాయి. 5వ తారీఖు దాటినా జనవరి నెల జీతాలు ఇంకా జమకాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అన్ని శాఖల ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు వేసినట్టు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ తమకు మాత్రం ఇప్పటి వరకు వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణను వివరణ కోరగా ఆయన స్పందించలేదు. డైరెక్టర్ సతీశ్‌కుమార్ మాత్రం జీతాలు తమ పరిధిలోకి రావని, అకౌంట్స్ అధికారులు చూసుకుంటారని తెలిపారు.

బీసీ సంక్షేమానికి 20 వేల కోట్లు కేటాయించాలి

- ఆర్థికశాఖ మంత్రి భట్టికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): బీసీల సంక్షేమానికి 2024-25 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సోమవారం ఆమె లేఖ రాశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని కవిత గుర్తు చేశారు. బీసీ సంక్షేమానికి వచ్చే ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని, ఎంబీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని కూడా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యత భవనాలను నిర్మిస్తామని వాగ్దానం చేసిందని తెలిపారు. బీసీలు మరింత అభివృద్ధి చెందడానికి రూ.20 వేల కోట్ల నిధులు దోహదపడుతాయని తెలిపారు.

'సుప్రీం'లో కవిత పిటిషన్ వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ సమన్లు ఇవ్వడంపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. వాదప్రతివాదనల అనంతరం విచారణను ఈ నెల 16కు వాయిదా వేస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. ఈ కేసులో ఈడీ తనను అకారణంగా గంటల తరబడి విచారించడం సరైనది కాదంటూ కవిత సుప్రీంను ఆశ్రయించారు. ఇటువంటి అభ్యంతరాలే గతంలోనూ పలువురు లేవనెత్తడంతో అన్నింటినీ కలిపి ఒకేసారి విచారించాలని ధర్మాసనం నిర్ణయించింది. గత విచారణలో నళినీచిదంబరం, అభిషేక్ బెనర్జీ కేసులతో కవిత కేసును సుప్రీంకోర్టు జతపరిచి విచారించింది. సోమవారం దీనిపై తుది విచారణ చేపట్టాలని కవిత తరపు న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. స్పందించిన న్యాయస్థానం వేర్వేరు కేసుల్లో గతంలో ఇచ్చిన తీర్పులను, ఉత్తర్వులను పరిశీలించాల్సి ఉన్నదని పేర్కొన్నది. మరోవైపు, ఈడీ తరపు న్యాయవాది మాట్లాడుతూ కవిత సమన్లు తీసుకోవడం లేదని, విచారణకు రావడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సమన్లు జారీచేయబోమని గత విచారణలో ఈడీ చెప్పిన విషయాన్ని కపిల్ సిబల్ గుర్తు చేయడంతో, అది ఒక్కసారికే పరిమితమని ఈడీ న్యాయవాది స్పష్టం చేశారు. అసలు ఈడీ నోటీసులే చట్టవిరుద్ధమని కపిల్ సిబల్ వాదించడంతో అన్ని విషయాలను 16న విచారణలో పరిశీలిస్తామని కోర్టు తెలిపింది.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



ముషీరాబాద్, ఫిబ్రవరి 5: అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీ.. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టి హామీ నిలబెట్టుకోవాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సోమవారం విద్యానగర్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మాదిగల చిరకాల కోరికైన ఎస్సీ వర్గీకరణను కేంద్రం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గణేశ్, రాందాస్, వరలక్ష్మి, కొల్లూరి వెంకట్, ప్రవీణ్, రమేశ్, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.